# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం ‘కౌముది‘ పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

Why do writers write? Because it isn't there.
- Thomas Berger

## శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు



ఆంధ్రభూమి వీక్లీ ఉధృతంగా వస్తున్న రోజుల్లో ఎప్పటి నుంచో ఉన్న ఆంధ్రప్రభ దినపత్రికతో పాటుగా ఆంధ్రప్రభ వీక్లీ ఎడిటర్‌గా కూడా శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు పని చేసేవారు. సాధారణంగా దినపత్రిక ఎడిటర్లకి వారపత్రికని నడపడంలో నైపుణ్యం ఉండకపోవడం నేను అనేకమంది దినపత్రిక ఎడిటర్లలో గమనించాను. దినపత్రికల్లో వారపత్రిక తరహాలో వచ్చే సండే సప్లిమెంట్‌ని సాహిత్యంలో ప్రవేశం, అభిరుచి గలవారే ఎడిట్ చేస్తారు. శ్రీ పొత్తూరి దినపత్రిక ఎడిటర్‌గా లబ్ధప్రతిష్టులు. వీక్లీకి ఆయన్ని ఎడిటర్ని చేసారు. ఆ నాటి ట్రెండ్‌కి అనుగుణంగా ప్రభ వీక్లీని ఆయన మార్చలేక పోయారు. వారి సనాతన సాంప్రదాయ సంస్కారం అందుకు అడ్డుపడిందని నా అభిప్రాయం.

భూమి వీక్లీలో అప్పటిలో నేను కథాకళి అనే శీర్షికని నిర్వహించాను. కొసమెరుపుతో ముగిసే సింగిల్ పేజ్ కథలని వారం వారం రాసేవాడిని. ఓ రోజు పొత్తూరి గారి నుంచి నాకు కబురు వస్తే వెళ్ళి కలిసాను. అలాంటి కథలు తమ వారపత్రికకి రాయమని కోరారు. నా సీరియల్‌ని అడుగుతారని అనుకున్న నేను కొద్దిగా డిసప్పాయింట్ అయ్యాను. ఆరు కథలు ఒకేసారి ఇస్తూ నేను మూడు సూచనలని చేసాను. ఆ కథలని వదలకుండా వారం వారం ప్రచురించాలన్నది నా మొదటి సూచన. దీన్ని పాటించకుండా మధ్యలో ఓ వారం స్పేస్ లేదని వేయనే లేదు. రెండవది, ఓ పేజీని ఆ కథలకి కేటాయించాలని కోరితే ఓ ఆర్టికల్ పూర్తయితే ఆ పేజీలో దానికింద ఫిల్లర్‌గా వేసేవారు. వారం వారం పాఠకులు దాన్ని గుర్తించడానికి అనువుగా కథాకళిలా నేను సూచించిన శీర్షికని ఆ కథలకి పెట్టమని సూచించాను. అదీ జరగలేదు. దాంతో నా కథలు అలా వృధా కాకూడదని ఆ తర్వాత ప్రభ వీక్లీకి వాటిని ఇవ్వడం మానేసాను. ఆ తర్వాత శ్రీ పురాణం సుబ్రమణ్య శర్మ ఉదయం వీక్లీకి ఎడిటర్ అయ్యాక కథాకేళి పేరుతో అని గుర్తు, ఈ మూడిటిని నేను సూచించకపోయినా పాటిస్తూ, నా కథలని సింగిల్ పేజీ కథలుగా చాలా కాలం ప్రచురించారు. మళ్ళీ శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావుని నేను ఎన్నడూ కలుసుకోలేదు.

ఆయన నా సీరియల్‌ని కోరకపోవడానికి కారణం ఉందని నాకు అప్పుడు తెలీదు. 'ఓ రాత్రి ఓ అమ్మాయిని ఎక్కడైనా కలుసుకుని సెక్స్ పాఠాలు నేర్చుకోవాలి' అనే ఇతివృత్తం గల 'పెద్దలకు మాత్రమే' లాంటి నవలని, అది సర్క్యులేషన్‌ని పెంచినా సరే పొత్తూరి గారు ఎన్నటికీ హర్షించరు. సికరాజులోని వారపత్రిక పాఠకులని ఆకట్టుకునే సమర్ధత శ్రీ పొత్తూరిలో లోపిస్తే, జిల్లెళ్ళమూడి అమ్మ భక్తులైన పొత్తూరిలోని ఉన్నత భావాలు, సాంప్రదాయం మీద గౌరవం, సమాజానికి చెడు చేసేవి ప్రచురించకూడదన్న నిబద్ధత సికరాజులో లోపించాయి. ఈ రెండూ ఒకే వ్యక్తిలో ఉండే అవకాశం ఉండదు.

## డి.భీమ్‌రెడ్డి మయూరి వీక్లీ

స్వాతి వీక్లీ ఆరంభం అయ్యాక వచ్చిన వారపత్రికల్లో ప్రధానమైంది 'మయూరి ' వీక్లీ. శ్రీ డి. భీమ్‌రెడ్డికి పత్రిక పెట్టాలన్న సరదా బాగా ఉండేది. అప్పటికే వారికి ఓ ప్రెస్, కార్డ్ బాక్స్ కంపెనీ అనే ఆఫ్‌సెట్ ప్రింటింగ్ వ్యాపారం ఉంది. 1978లో ఆంధ్రభూమి వీక్లీ సికరాజు ఎడిటర్ గా మొదలయ్యాక దాని ముఖ చిత్రం డెక్కన్ క్రానికల్ ప్రెస్‌లో ఇంకా అప్పటికి కలర్ అచ్చు యంత్రం రాకపోవడంతో


మారేమండ సీతారామయ్య

భీమ్‌రెడ్డి ప్రెస్‌లో అచ్చయ్యేది. భీమ్‌రెడ్డికి భూమి వీక్లీ చూసాక పత్రిక పెట్టాలన్న సరదా ఏర్పడింది. చేతిలో ప్రెస్ ఉంది కాబట్టి శ్రీ డి.భీమ్‌రెడ్డి కాకతీయ పబ్లికేషన్స్‌ని స్థాపించి డిసెంబర్ 1979లో శ్రీ వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో, వి.మధుసూధనరావు వారి కార్యాలయానికి ప్రెస్ పని మీద వచ్చి వెళుతూండటంతో ఆయనతో పరిచయం పెరిగి ఆయన్ని సంపాదకుడిగా తీసుకున్నారు. ఆ తర్వాత పింగళి దశరథ్ రామ్ ఎన్‌కౌంటర్ విజయవంతం అవడంతో ఆ తరహాలో ఏప్రిల్ 1981లో 'ఆదివారం' అనే సోషియో -పొలిటికల్ వీక్లీని ఆరంభించారు. ఏప్రిల్ 5, 1981 ఆదివారం ఉగాది నాడు 'ఆదివారం' పత్రిక ఆవిష్కరణని ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య ఆవిష్కరించారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడు ఎస్.జైపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. దాంట్లో సీరియల్స్ రాసే మాదిరెడ్డి సులోచన, వాసిరెడ్డి సీతాదేవి, సి.ఆనందారామంలకి, ఫీచర్ రైటర్ శారదా అశోక్‌వర్ధన్‌లకి మెమొంటోలని అందచేసారు.




కమ్మర్షియల్ రచయితల తాకిడి రచయిత్రులని తాకక మునుపటి కాలం ఇది. 1982 కల్లా రచయిత్రుల ప్రాభవం తగ్గడం ఆరంభమైంది. అదే వేదిక మీద పోటీలో బహుమతి పొందిన కథా రచయితలు వి.రాజామ్మోహన్ రావు, జీడిగుంట రామచంద్రమూర్తి, వల్లూరి శివప్రసాద్, వంశీకృష్ణ, పులిచెర్ల సుబ్బారావు, హేమలతా కృష్ణమూర్తి, అరుణాచలంలకి కూడా బహుమతి ప్రదానం చేసారు. ఆనాటి రాజకీయ సంచలన వార్తలని ఇందులో ప్రచురించేవారు. వీరేంద్రనాధ్ - జ్యోతి కేసుని కూడా ఇందులో కొన్ని వారాలు ప్రచురించేవారు. మారేమండ సీతారామయ్య కూడా దీంట్లో పని చేసారు. (ఆ తర్వాత మారేమండ సీతారామయ్య సోదరుడు యం.ఎన్.రావ్ 'కొక్కొరకో' అనే కోళ్ళ పత్రికని పెట్టి నా రచనలని కొన్నిటిని ఆ పత్రికలో వేసారు. అది బయట దొరికే పత్రిక కాదు. కేవలం కోళ్ళ పరిశ్రమదారులకి మాత్రమే చందా ద్వారా పోస్ట్‌లో వెళుతుంది) కొంతకాలానికి వెంకట్రామ్ రెడ్డిగారు నిష్క్రమించారు.

1982లో ఓ సాయంత్రం సికరాజు నన్ను తనతో ఫతేమైదాన్ క్లబ్‌కి తీసుకువెళ్ళారు. అక్కడ నాకు శ్రీ డి.భీమ్‌రెడ్డిని పరిచయం చేసారు. కొద్దిసేపయ్యాక భీమ్‌రెడ్డి ఆదివారం పత్రికకి నా సీరియల్ ఇవ్వమని కోరారు. ఆ సమయంలో ఆంధ్ర భూమిలో పెద్దలకు మాత్రమే సీరియల్ వస్తోంది. అది పాఠకుల అభిమానాన్ని చూరగొన్న నవల కావడంతో ఆదివారంలో దాన్ని విమర్శిస్తూ రాసారు. ఆ సంగతి గుర్తుచేస్తూ, నేను ఆదివారానికి రాయనని గట్టిగా చెప్పాను. సికరాజు అలా మాట్లాడద్దని ఆయన నాకు సలహా ఇచ్చారు. 'ఈ విషయంలో మల్లిక్, మీరు ఇద్దరూ ఇద్దరే' విసుక్కున్నారు.


శ్రీ మధుసూదనరావు

రామోజీరావుగారి మయూరి సినిమా హిట్ అయ్యాక ఆ పేరుతో మే 1985లో 'మయూరి ' వీక్లీని ఆరంభించారు. కాని ఆదివారం పత్రిక ప్రారంభోత్సవంలా ఘనంగా కాక చాలా నిరాడంబరంగా 'మయూరి ' వీక్లీని ప్రారంభించారు. ఈ మూడు పత్రికలకి కూడా వర్కింగ్ ఎడిటర్ శ్రీ వి మధుసూధనరావు. సికరాజుని వాటి ఎడిటర్‌గా రమ్మని భీమ్ రెడ్డి కోరారు. కాని తను బయట నుంచి సలహాలు ఇస్తానని సికరాజు చెప్పారు. ఆదివారం ఎడిట్ చేసే శ్రీ వి మధుసూదనరావు మయూరి

వర్కింగ్ ఎడిటర్‌గా కొనసాగి పత్రికని డిజైన్ చేసారు. భీమ్‌రెడ్డి ఆంధ్రభూమి ఎడిటర్ శ్రీ కనకాంబరరాజు సలహాలు, సూచనలు తీసుకునేవారు. ప్రారంభ సంచిక నుంచే నా సీరియల్‌ని ఇవ్వమని శ్రీ భీమ్‌రెడ్డి సికరాజు ద్వారా అడిగించారు.

ఓ రోజు నాంపల్లిలో అన్నపూర్ణ హోటల్ ఎదురుగా హిందీ ప్రచార సభ ఆవరణలో ఉన్న మయూరి ఆఫీస్‌కి వెళ్ళాను. వారి తమ్ముళ్ళు శ్రీ డి.అచ్యుత్ రెడ్డి, శ్రీ డి. ఉమాపతి రెడ్డి ఆ వ్యాపారాన్ని చూసేవారు. నేను కోరిన పారితోషికాన్ని ఇవ్వడానికి భీమ్‌రెడ్డి అంగీకరించారు. నాది, వీరేంద్రనాథ్‌ది సీరియల్స్ ఉంటే పాఠకులు పత్రికలని చదువుతారని ఏజెంట్ల ద్వారా భీమ్‌రెడ్డికి తెలుసు కాబట్టి పారితోషికం విషయంలో నా దగ్గర అట్టే బేరం ఆడలేదు.

ఈనాడు, ఆంధ్రభూమి డైలీలో స్ట్రింగర్ గా కొద్ది నెలలు పని చేసిన శ్రీ పి. సత్యనారాయణ అనే అతను సబ్ ఎడిటర్‌గా పత్రిక మూసేసేదాకా అందులో పనిచేసారు.

'నేను చేరిన మొదటి రోజే భీమ్‌రెడ్డిగారు నన్ను ఎక్కడికీ వెళ్ళద్దని చెప్పారు. మధ్యలో మయూరి ఆపేసినా నాకు జీతం ఇచ్చేవారు. ఇక శాశ్వతంగా మూసేసామని చెప్పాకే నేను బయటకి వెళ్ళాను' అని సత్యనారాయణ చెప్పారు. రామ్‌నగర్‌లో ఉండే అతను వారం వారం దారిలో మా ఇంటికి వచ్చి సీరియల్ స్క్రిప్ట్ తీసుకు వెళ్ళేవాడు. కల్నల్ ఏకలింగం ఎడ్వెంచర్స్ నుంచి నా చేతి రాతని చూసి అతను ఫెయిర్ చేసి మళ్ళీ దాన్ని తెచ్చి నా చేత కరెక్షన్స్ చేయించుకుని తీసుకు వెళ్ళేవాడు. మయూరి మూసేసాక కూడా పి.సత్యనారాయణ కొద్ది నెలలు అక్కడే పని చేసారు. మళ్ళీ పత్రికని ఆరంభించాలనే కోరిక భీమ్‌రెడ్డిగారికి ఉండేది.


పి. సత్యనారాయణ

శ్రీ డి.భీమ్‌రెడ్డి స్వగ్రామం మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర దగ్గర ఓ చిన్న గ్రామం. ఎప్పుడూ తెల్లటి పేంట్, షర్ట్‌లలో ఉండే, ఏభై పై బడ్డ భీమ్‌రెడ్డి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అని తెలిసి కొద్దిగా ఆశ్చర్యపోయాను. ఫక్తు తెలంగాణా జమిందారి పద్ధతిలో పెద్ద దొరలా ఉండేవారు. కాని ఆయనకి ఆస్తులు లేవని, భీమ్‌రెడ్డి చాలా కష్టపడి పైకి వచ్చారని, మంచి స్టేజి ఆర్టిస్ట్ అని, చక్కగా పౌరాణిక నాటకాల్లోని పద్యాలు పాడేవారని శ్రీ పి.సత్యనారాయణ చెప్పారు. అలా కళాహృదయం గల ఆయనకి సాహిత్యం మీద మాత్రం అభిలాష కాని, ప్రవేశం కాని లేవు. ఓ పత్రిక తన చేతిలో ఉంటే రాజకీయంగా పలుకుబడి ఉంటుందని నడుపుతున్నానని ఓ సారి చెప్పారు. లలిత అనే ఆమె డి. భీమ్‌రెడ్డికి సెక్రెటరీగా ఉండేది. నాతో ఆయన మాట్లాడాక వి మధుసూదన రావుని పిలిచి నన్ను అతనికి పరిచయం చేసారు. మయూరి వర్కింగ్ ఎడిటర్ శ్రీ వి మధుసూధన రావుని కలవడం అదే మొదటిసారైనా అతని పేరు నాకు బాగా పరిచయం. 1973లో నేను ప్రభ వీక్లీలో మిసెస్ పరాంకుశం అనే సీరియల్‌ని రాసినప్పుడు దాన్ని మెచ్చుకుంటూ అతను కొంపెల్ల విశ్వం అనే అతనితో కలిసి రాసిన ఉత్తరం ప్రభలో ఉత్తరాల శీర్షికలో ప్రచురించారు. తర్వాత వీరిద్దరూ కలిసి 'రంగు వెలసిన బొమ్మ' అనే కథని ఆంధ్రప్రభ వార పత్రిక దీపావళి కథల పోటీకి పంపితే అది సాధారణ ప్రచురణకి స్వీకరించబడింది.

'డబ్బెవరికి చేదు? ' అనే సీరియల్‌ని మయూరి మొదటి సంచికలో ఆరంభించాను. ఆ తర్వాత తొమ్మిదిగంటలు (1989), విటమిన్.యం(1992), మై డియర్ ఎనిమి, మాట్లాడే బొమ్మ(1991) కల్నల్ ఏకలింగం ఎడ్వెంచర్స్ (1992-93) డి ఫర్ డెత్ (1995), గ్రీన్ కార్డ్(2000) వస్తూండగా మయూరి మూసేయడంతో నేను దాన్ని తర్వాత పూర్తి చేసాక పుస్తకంగా వచ్చింది. మయూరిలో వచ్చిన నా సీరియల్స్‌లో అధిక భాగం సినిమాలుగా వచ్చాయి.

ఎవరి సీరియల్స్ వేయాలో భీమ్‌రెడ్డి ఏజెంట్ల సలహాల మీద నిర్ణయించేవారు. సీరియల్స్ విషయంలో ఏ వర్కింగ్ ఎడిటర్‌కీ ప్రాధాన్యత ఉండేది కాదు. 'మయూరి 'లో రాసినంతమంది సీరియల్స్ రచయితలు మరే వారపత్రికలో రాయలేదు. ఆ నాటి ప్రముఖ

రచయితలు శ్రీయుతులు కొమ్మూరి వేణుగోపాలరావు (విరాజి), యండమూరి వీరేంద్రనాథ్ (భార్యా గుణవతీ శత్రు), చందు సోంబాబు (ఇదిగో కన్నీళ్ళు దోసిళ్ళు పట్టండి), యర్రంసెట్టి శాయి, కొమ్మనాపల్లి గణపతిరావు (అగ్నిహోత్రుడు) డాక్టర్ కొత్త రవీంద్రబాబు (ఛాలెంజ్), సూర్యదేవర రామ్మోహన రావు, జి.వి అమరేశ్వరరావు, చల్లా సుబ్రమణ్యం, మధుబాబు, దంతులూరి పండరీనాథ్, రామవరపు వేణుగోపాలరావు (క్షణం క్షణం భయంభయం), విశ్వప్రసాద్ (డ్రాక్యులా), జి.ఎన్.సూరి (చివరి అంచు), మన్నెం శారద (ఆనాటి రాత్రి), శారదా అశోక వర్ధన్, చావా శివకోటి, మాగుంట దయాకర్ (మరణం శరణం గచ్చామి), సి.ఆనందారామం, రావినూతల సువర్ణాకన్నన్, బొమ్మదేవర నాగకుమారి, బలభద్రపాత్రుని రమణి, ముచ్చర్ల రజనీ శకుంతల మొదలైన వారి సీరియల్స్ వచ్చాయి. వి.రాజారామ్మోహన్ రావ్, పమ్మి వీరభద్రరావు కథలు ఎక్కువగా వచ్చేవి. పమ్మి సీరియల్ కూడా ఒకటి వచ్చిన గుర్తు. ఆ రోజుల్లో సీరియల్స్‌కి ఎంత క్రేజ్ ఉండేదంటే పరుచూరి బ్రదర్స్ కూడా శ్రీ అచ్యుత రెడ్డి ద్వారా 'భరతఖండం భగ్గుమంటోంది' అనే సీరియల్‌ని మయూరిలో రాసారు! కాని అది మధ్యలోనే ఆగిపోయిందని గుర్తు. శ్రీ జైహింద్ రెడ్డి నడిపిన దాంపత్య జీవితం అనే శీర్షికలో సందేహాలకి సమాధానాలు, సెక్స్‌కి సంబంధించిన వ్యాసాలు, వివిధ కథకులు రాసే శృంగార కథలు, సుగంబాబు 'స్వాతి' అనే కలం పేరుతో రాసిన శ్రీవారి ముచ్చట్లు పాఠకులని ఆకట్టుకునేవి.


మాగుంట దయాకర్


కొనకంచి లక్ష్మీ నరసింహారావు,

మయూరి వార పత్రికతో పాటు 'మయూరి' మాస పత్రిక కూడా వచ్చేది. అందులో చతురలోలా ఓ పూర్తి నవల వచ్చేది. భీమ్‌రెడ్డిగారి పేరు తప్ప వర్కింగ్ ఎడిటర్ లేదా సబ్ ఎడిటర్ల పేర్లు ఎవరివీ ఆ పత్రికల్లో వేసేవారు కారు. 1989లో మయూరి మూసేస్తారనే టాక్ రావడంతో వి మధుసూదనరావు ప్రభ దినపత్రికకి సబ్ ఎడిటర్‌గా వెళ్ళిపోయారు. ఆ తర్వాత చాలామంది ఎడిటర్లు మారారు. మయూరిలో సీరియల్స్ రాసిన మాగుంట దయాకర్ అనే రచయిత 'మయూరి' వర్కింగ్ ఎడిటర్‌గా వి.మధుసూదనరావు తర్వాత కొంతకాలం పని చేసారు. ఆ తర్వాత కిషోర్ మయూరి వర్కింగ్ ఎడిటర్ అయ్యారు. ఆ తర్వాత శర్మాజీ. చివర్లో పి.సత్యనారాయణే చూసేవారు. సబ్ ఎడిటర్లుగా రచయిత కొనకంచి లక్ష్మీ నరసింహారావు, విక్రం, సుగంబాబు, భాగవతుల సుబ్రమణ్యం మొదలైన వారు పని చేసారు. బి.భవాని(పురుషుడు) ఉమ(పురుషుడు) శేఖర్, బి.నాగిరెడ్డి మొదలైన వారు లే అవుట్ ఆర్టిస్టులుగా పనిచేసేవారు. గోపి, చంద్ర, రంగారెడ్డి(రంగ) కరుణాకర్, కె.నాగేశ్వరరావు మయూరికి బొమ్మలు గీసేవారు.

శ్రీ భీమ్‌రెడ్డిని పొదుపరి అనే కంటే, శ్రీ చెన్నారెడ్డిలా పిసినారి అనే చెప్పాలి. సీరియల్ రచయితలని వదిలేస్తే కథా రచయితలకి పెద్దగా పారితోషికం ఇచ్చేవారు కారు. సిబ్బందికి జీతాలు కూడా తక్కువగా ఇచ్చేవారు.

జొన్నలగడ్డ కిషోర్ వర్కింగ్ ఎడిటర్‌గా పని చేసినప్పుడు మయూరిని అభివృద్ధిలోకి తేవాలని ప్రయత్నించేవాడు. వైవిధ్యం గల శీర్షికలతో ఆ నాటి పాఠకులని ఆకట్టుకునేలా శ్రీ జె.కిషోర్ శ్రమపడి పత్రికని తన పరిధిలో బాగా తెచ్చేందుకు ప్రయత్నించేవారు. రాజకీయ ప్రముఖులతో ఇంటర్వ్యూలు, పాఠకులని ఆకట్టుకునేలా శీర్షికలు వేసేవాడు. అతని కృషివల్లే మిగిలిన వారికన్నా ఎక్కువకాలం మయూరి వర్కింగ్ ఎడిటర్‌గా కొనసాగాడు. అతను ఆ రోజుల్లో గాంధీనగర్ లోని మా ఇంటి వెనక సందులో అద్దెకి ఉండేవాడు. సన్నగా, నల్లగా, పొడుగ్గా గడ్డంతో ఉండే కిషోర్ బలహీనత ఆల్కహాల్. ఒకోసారి డ్రింక్ తీసుకుని ఆఫీసుకి వచ్చేవాడు. ఓ రోజు అతను భీమ్‌రెడ్డితో మాట్లాడుతూంటే వాసన రావడంతో అతన్ని భీమ్‌రెడ్డి ఉద్యోగంలోంచి తొలగించారు. ఆ తర్వాత మళ్ళీ చేరాడు. జె.కిషోర్‌కి

ఓ నిక్‌నేమ్ ఉండేది. అది గడ్డం కిషోర్. డ్రింక్ తీసుకున్నప్పుడు అతను పదే పదే గడ్డాన్ని చేత్తో దువ్వుకునేవాడు. అందుకుని అతనికి ఆ నిక్‌నేమ్ వచ్చింది.

ఓ రోజు కిషోర్‌కి ఫోన్‌లో కొత్త నవలకి పేరుని సూచించాను. అది విని 'ఇదేదో వింటానికి ఆసక్తిగా ఉంది' అన్నది అతని రెస్పాన్స్. దాని పేరు కల్నల్ ఏకలింగం ఎడ్వెంచర్స్. కిషోర్‌తో నాకు గల మరో జ్ఞాపకం అతనిలో ఆల్కహాలిజం వల్ల నేను రాసిన ఓ మంచి వ్యాసాన్ని కిల్ చేయడం. ఓసారి నిజాం క్లబ్‌లో నాకు ఓ వ్యక్తి పరిచయం అయ్యారు. ఆయన పేరు వెంకటేశ్వరరావు అని గుర్తు. పారిశ్రామిక వేత్త. ఆయనకి కుడిచేయి లేదు. అది ఎలా జరిగిందో నాకు వివరించారు. ఆయన తన అంబాసిడర్ కారుని డ్రైవ్ చేసుకుంటూ వస్తూ సూర్యాపేట దాటాక ఓ పల్లెటూరు దగ్గర (పేరు గుర్తులేదు) తన కుడి చేతిని కార్లోంచి బయటికి సిగ్నల్‌గా చాచారు. మరుక్షణం అతని ఆ చెయ్యి మాయం అయింది! వెనక నుంచి వచ్చే లారీ ఆ కారుని రాసుకుంటూ వెళ్ళడంతో చెయ్యి తెగిపడిపోయింది. ఆయన కారు ఆపి, రోడ్డుమీద పడి ఉన్న తన ఆ చేతిని తీసుకుని, సమీప పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి జరిగింది ఫిర్యాదు చేసాడు. అక్కడి సిఐ ఆయన్ని పోలీస్ వాహనంలో హైదరాబాద్‌కి పంపించారు. ముందే ఫోన్ చేయడం వల్ల అపోలో హాస్పిటల్ అంబులెన్స్ నగర శివార్లలో సిద్ధంగా ఉంది. ఆయన చెయ్యిని అతికించలేకపోయారు. దాంతో కుడిచేయిలేని ఆయన ఒంటిచేత్తో కారుని నడుపుతున్నారు. ఆయన చెప్పిన మాటలు నాకు బాగా గుర్తు. 'దేవుడు మనిషికి రెండు చేతులు ఇచ్చాడు. నిజానికి ఒకటి చాలు.' ఒంటిచేత్తో ఆయన అన్ని పనులు చేసుకుంటూ అందరిలా మామూలుగా జీవించడం అలవరచుకున్నాడు.

ఆయన వ్యాపార రీత్యా అమెరికాకి తరచు వెళుతూండేవారు. అలా వెళ్ళినప్పుడు తన కారుని అక్కడ తనే నడుపుకుంటాడు. ఆ తర్వాత అమెరికా వెళ్ళినప్పుడు ఒంటి చేతి ఆయనకి కొత్త డ్రైవింగ్ లైసెన్స్‌ని జారీ చేసారు. దాన్ని ఆయన నాకు చూపించారు. మన రాష్ట్రం వాళ్ళు మాత్రం ఆ అంగవైకల్యం వల్ల డ్రైవింగ్ లైసెన్స్‌ని ఇవ్వమని తిరస్కరించారు. అమెరికన్ డ్రైవింగ్ లైసెన్స్ చూపించినా ఒప్పుకోలేదు. తర్వాత ఫైట్ చేసి తీసుకున్నారు. ఆయన కథనం నన్ను బాగా ఆకట్టుకుంది. అవన్నీ నోట్ చేసుకుని మర్నాడు కిషోర్‌తో మాట్లాడి చిత్రభూమి కెమెరామెన్‌ని పంపి కారు దగ్గర నుంచున్న ఆయన ఫోటోలని తీసి మయూరిలో ప్రచురణకి ఆ వ్యాసాన్ని రాసి ఇచ్చాను. మూడు వారాలు ఐనా కిషోర్ దాన్ని ప్రచురించలేదు. దేనికని అడిగితే 'ఆయనతో నన్నోసారి నిజాం క్లబ్‌కి తీసుకెళ్ళమనండి' అని తాగుడు లంచంగా అడిగాడు! నేను ఆ పని చస్తే చేయనని చెప్పాను. కిషోర్ నాకు ఆ వ్యాసం తిరిగి ఇవ్వలేదు. పోయిందని చెప్పాడు. నేను కాపీ పెట్టుకోలేదు. పెట్టుకున్నా ఇలాంటి ఉత్తేజాన్ని కలిగించే వ్యాసాలని ఆనాటి ఏ ఎడిటర్ ప్రచురించరని నాకు తెలుసు. ఆ విధంగా ఓ మంచి కథనాన్ని కిషోర్ కిల్ చేసేసాడు. భీమ్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తే, అతని ఉద్యోగం ఊడచ్చనే భయంతో నేనాపని చేయలేదు. భీమ్‌రెడ్డే సీరియల్స్‌ని నిర్ణయించేవారు కాబట్టి కిషోర్ నా నుంచి ఎన్నడూ మందు పార్టీలని డిమాండ్ చేయలేదు. కాని కొందరిని నుంచి అవి అతను తీసుకునేవాడిని ఈ సంఘటన తర్వాత నాకు అర్థమైంది. 2009లో కిషోర్ పోయారని పేపర్‌లో చదివాను. అంతకు ఐదారేళ్ళ మునుపే ఆయన భార్య కేన్సర్‌తో పోయింది. ఆయనకి ఒకే కూతురు. ప్రత్యూష.




కల్నల్ ఏకలింగం ఎడ్వెంచర్స్ హిట్ సీరియల్. మా ఎగ్రిమెంట్ ప్రకారం ఇరవై ఐదు వారాల్లో దాన్ని ముగించాలి. కాని కేవలం సాఫ్ట్ పోర్నోగ్రఫీ జోక్స్‌తో మాత్రమే సాగే ఆ సీరియల్‌కి పాఠకుల రెస్పాన్స్ బావుండటంతో ఏజెంట్ల సలహామీద శ్రీ భీమ్‌రెడ్డి దాన్నే కొనసాగించమని, ఇంకో నవలకి ఇచ్చే పారితోషికాన్ని ఈ కొనసాగింపుకి కూడా ఇస్తానని కోరారు. మరో పాతిక వారాల తర్వాత కూడా మళ్ళీ దాన్ని కొనసాగించమని కోరారు. నాలుగో సారి కూడా దాన్ని ఇదే



శ్రీ భీమ్‌రెడ్డి

పద్ధతిలో కొనసాగించాను. కాని ఎవరో ఆ నవలకి వేసిన బొమ్మలు అసభ్యంగా ఉన్నాయని, ఆపేయమని, లేదా కోర్టుకి వెళతామని లీగల్ నోటీస్ పంపడంతో శ్రీ భీమ్‌రెడ్డి దాన్ని నాకు చూపించారు. కోర్టుకి వెళితే 'కాలు మీద కాలేసుకుని కూర్చున్నా, గట్టిగా దగ్గినా కూడా బంట్రోతు ఊరుకోడు. కోర్టుకి వెళ్ళి క్లాసులోని స్టూడెంట్‌లా కూర్చోవడం నాకు చిరాకు. ఆపేద్దాం.' అని కారణం చెప్పారు. గెలుస్తామని తెలిసినా కోర్టుకి వెళ్ళడానికి ఆయన భయపడ్డారు. దాన్ని కల్నల్ ఏకలింగం ఎడ్వెంచర్స్, కల్నల్ ఏకలింగం (ఇంకొన్ని) ఎడ్వెంచర్స్, కల్నల్ ఏకలింగం (మరికొన్ని) ఎడ్వెంచర్స్ పేర్లతో నేను లిపి పబ్లికేషన్స్ స్థాపించాక, మొదటి నవలలుగా ప్రచురించాను.

శ్రీ భీమ్‌రెడ్డికి మొదట్లో నేను రాసే నవల థీమ్ చెప్పబోతే 'నాకు అదంతా అనవసరం. మంచిగా రాయండి. ఓ పదివేల కాపీలు పెరగాలి' అనేవారు. ఆయన కల్లాకపటం తెలీని మనిషి. రాజకీయాల్లో ఆసక్తి ఉన్నా రాజకీయాలు చేయడం, జిత్తులు, వెన్నుపోట్లు, ఇతరులకి హాని చేయడం లాంటివి ఎరగరు. ముక్కు సూటిగా ఉండేవారు. 'మా తమ్ముళ్ళకి పత్రికని మూసేయాలని ఉంది. ఇందులో నష్టం తప్ప లాభం రావడంలేదు. నా బలవంతం మీదే నేను నడుపుతున్నాను.' అని చాలాసార్లు భీమ్‌రెడ్డి నాతో చెప్పారు. ఎందుకంటే అదే టైంని ప్రెస్ మీద పెడితే వచ్చే లాభంతో పోలిస్తే మయూరి పత్రిక వల్ల వచ్చే లాభం బాగా తక్కువ. ఆయన తమ్ముడు శ్రీ అచ్యుత రెడ్డికి సినిమాల్లో వేషాలు వేసే ఆసక్తి ఉండేది. కొన్ని చిత్రాల్లో నటించారు కూడా. ఓ సారి 'మయూరి 'ని మూసేసి, కొంతకాలం తర్వాత పత్రికని నడపాలనే వ్యామోహంతో భీమ్‌రెడ్డి మళ్ళీ దాన్ని ఆరంభించారు.



స్వాగతోపన్యాసమిస్తున్న 'ఆదివారం సంపాదకులు శ్రీ డి. భీమ్‌రెడ్డి

నాకు బాగా గుర్తు. ఎన్టీఆర్ ప్రొహిబిషన్ పెట్టినప్పుడు అసిస్టెంట్ ఎడిటర్ పి.సత్యనారాయణ వివిధ వైన్ షాపులు తిరిగి భీమ్‌రెడ్డి తాగే పీటర్ స్కాట్ విస్కీ బాటిల్స్ అన్నీ కొని తీసుకెళ్ళి భీమ్ రెడ్డికి ఇచ్చారు. 'ఆ మూడురోజులు నాకు ఇదే పని' అని సత్యనారాయణ తర్వాత చెప్పారు. ఐతే నేను వారి పత్రికకి రాసినప్పుడు ఎప్పుడూ భీమ్‌రెడ్డి నన్ను మందు పార్టీకి పిలవలేదు. ప్రొహిబిషన్ పీరియడ్‌లో ఓసారి నేను అడిగితే ఓ పీటర్ స్కాట్ బాటిల్‌ని నాకు ఆయన దాని ధర తీసుకుని ఇచ్చారు. తను ప్రతీ రాత్రి ఒకటిన్నర పెగ్ మించి తాగనని చెప్పారు. ఆయనకి ఇల్లు, ఆఫీసు, ఫతేమైదాన్ క్లబ్ తర్వాత ఇంకేమీ వ్యాపకాలు ఉండేవి కావు.

నా ఆఖరి సీరియల్ 'గ్రీన్ కార్డ్' వస్తూండగా ఓ రోజు శ్రీ భీమ్‌రెడ్డి పిలిచి తన తమ్ముళ్ళు ఇద్దరూ పత్రికని మూసేయమని గొడవ చేస్తున్నారని, దాంతో ఆపక తప్పటం లేదని, మళ్ళీ టైం చూసుకుని స్టార్ట్ చేస్తానని చెప్పారు. కాని అప్పటికే సత్యనారాయణ ఇక ఆయన మళ్ళీ దాన్ని స్టార్ట్ చేయరని ఫీలర్‌ని ముందే ఇచ్చారు. ఆ సీరియల్‌కి పారితోషికం పాతికవేలు భీమ్‌రెడ్డి ఇవ్వనే లేదు. దానికి నేను అడ్వాన్స్ కూడా తీసుకోలేదు. నా సీరియల్‌కి పారితోషికాన్ని చెల్లించని మొదటి పత్రికాధిపతి శ్రీ భీమ్‌రెడ్డి. ప్రస్తుతం ఆయన కార్డు బాక్స్ ఆఫ్‌సెట్ ప్రెస్ ని సోదరులతో కలిసి చూసుకుంటున్నారు. 'మన తెలంగాణా' అనే దినపత్రికని ఆరంభించేందుకు అనుమతిని పొందారని మధుసూదన రావుగారు చెప్పారు.

స్వాతి బలరాంకి గల నిబద్ధతతో మయూరి కొనసాగి ఉంటే, ఆ పత్రిక ద్వారా భీమ్‌రెడ్డి కోట్లు గడించి ఉండేవారు. కాని సిబ్బందికి ఇచ్చే జీతాన్ని, రచయితలకి ఇచ్చే పారితోషికాన్ని పెట్టుబడిలా కాక నష్టంలా ఆయన పత్రిక మూసేసే దాకా భావించేవారు. కాబట్టి పత్రిక విజయవంతం అయ్యే అవకాశం ఉండి కూడా. ఎనభై వేల సర్క్యులేషన్‌తో ఆరంభం అయి, ఇరవై వేల సర్క్యులేషన్‌కి తగ్గి మూతపడ్డ పత్రికల జాబితాలో మయూరి వారపత్రిక కూడా చేరింది.

*(మిగిలిన విశేషాలు వచ్చేనెల)*

Click here to share your comments on this article